క్లుప్తంగా

జగనన్న విద్యా కానుకల పరిశీలన



బిక్కవోలులో జగనన్న కానుకలు పరిశీలిస్తున్న ఆర్జేడీ నాగమణి

బిక్కవోలు: స్థానిక ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు వచ్చిన జగనన్న విద్యాకానుకలను ఆర్జేడీ జి.నాగమణి బుధవారం పరిశీలించారు. విద్యా కానుక మెటీరియల్స్ కోసం పాఠశాలలో ఆరు గదులను ఏర్పాటు చేశారు. ఈ గదుల్లో పుస్తకాలు, బ్యాగ్స్, బెల్ట్, షూ, సాక్స్, టెస్ట్‌బుక్స్, ఆక్స్‌వర్డ్ డిక్షనర్‌లను ఉంచనున్నారు. ఇప్పటికి వరకూ టెస్ట్ బుక్స్ 14,459, ఆక్స్‌వర్డ్ డిక్షనర్ 480 పుస్తకాలు వచ్చాయి. వీటిని ఆమె పరిశీలించారు. అలాగే శాంపిల్స్‌గా వచ్చిన టై, బ్యాగ్స్, బెల్ట్, షూ, సాక్స్‌ను పరిశీలించారు. వీటిలో ఏదైనా క్వాలిటీ బాగుంటేనే తీసుకోవాలని, లేకుంటే వెంటనే గోడౌన్ పంపించాలన్నారు. వచ్చిన మెటీరియల్ క్లాసులు వారీగా విడగొట్టి భద్రపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో జీవీకే పాయింట్ ఇన్‌చార్జి జి.పైడ్రాజు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ శ్రీనివాసు, సీఆర్‌పీ మాధవి, ఎల్.అకౌంటెంట్ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో కూరగాయ పంటలకు మేలు



నల్లమిల్లిలో కళకళలాడుతున్న వంగ తోట

రంగంపేట: ఇటీవల కురిసిన వర్షాలు వరి రైతులకు నష్టం కలిగించినా కూరగాయల పంటకు మాత్రం మేలు చేశాయి. రంగంపేట, వడిశలేరు, కోటపాడు, సింగంపల్లి, మర్రిపూడి, నల్లమిల్లి, జి.దొంతమూరు, ఈలకొలను, ముకుందవరం తదితర గ్రామాల్లో సాగు చేస్తున్న కూరగాయల పంటలు కళకళలాడుతున్నాయి. వంగ, బెండ, బీర, దొండ, గోరు చిక్కుడు, ఆనప, మిరప తదితర కూరగాయ పంటలతో పాటు తోటకూర, గోంగూర, కొత్తిమీర తదితర ఆకు కూరలకు సరిపడా నీరు లభ్యమైందని రైతులంటున్నారు.

ఘనంగా గోపూజ



గోపూజ చేస్తున్న సర్పంచ్ దంపతులు

బిక్కవోలు: మెళ్లూరు గ్రామంలోఉన్న విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ ధ్వజ స్తంభ మహోత్సవంలో భాగంగా తొలిరోజు బుధవారం గో పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి పెద్దిరెడ్డి సత్యసాయిరాం, సత్యకుమారి దంపతులు ప్రత్యేక పూజాలు చేశారు. అనంతరం గోపూజ చేశారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదం



అపార్టమెంట్ సన్ షేడ్‌పై చెలరేగుతున్న మంటలు

అనపర్తి: స్థానిక శేషగిరిరావుపేటలోని ఓ అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో బుధవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. దీనికి సంబంధించి అనపర్తి అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. అపార్టమెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఈ–స్టోర్ ఇండియా పేరుతో నిర్వహిస్తున్న సూపర్‌మార్కెట్ సన్‌షేడ్‌పై ఉన్న విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పురవ్వలు చెలరేగి అక్కడే ఉన్న అట్టపెట్టలపై పడడంతో మంటలు వ్యాపించాయి. దీనిని గమనించిన స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి, విద్యుత్‌శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. విద్యుత్ శాఖ సిబ్బంది సరఫరాను నిలిపివేశారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేయడంతో పెనుప్రమాదం తప్పింది.

కేంద్రమంత్రికి వినతి

ప్రకాశంనగర్: ఆంధ్రప్రదేశ్ నుంచి హజ్ యాత్రకు వెళ్లే హాజీల విమాన చార్జీలు తగ్గించాలని కోరుతూ రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి అంజాద్ బాషా, ఎంపీ మిథున్‌రెడ్డి, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌసుల్ ఆజమ్‌లు కేంద్రమంత్రి స్మృతి ఇరానీని కోరారు. ఈ మేరకు బుధవారం కేంద్ర మంత్రి కార్యాలయంలో కలసినట్లు ఓ ప్రకటనను విడుదల చేశారు. ఈ విషయంపై స్పందించిన కేంద్ర మంత్రి తప్పకుండా చార్జీల విషయంపై ఆలోచిస్తామని తెలిపారన్నారు. రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ ఇబాదుల్ల, ఖాదర్, ఆలీ తదితరులు ఉన్నారు.

నివరిగప్పిన నిప్పు



రాపాకలోని పంట పొలంలో వేసిన వరి కుప్పలు

- పంట పొలాల్లోనే వరి కుప్పలు
- అగ్ని ప్రమాదాలతో హడల్
- జాగ్రత్తలు పాటించాలంటున్న అధికారులు

సీతానగరం: ప్రకృతి రైతన్నల కష్టంపై నీళ్ల జల్లుతోంది.. అహర్నిశలూ శ్రమించి పండించిన కష్టాన్ని తుడిచి పెట్టేస్తోంది.. అంతేకాకుండా మానవ తప్పిదాలకూ పంట ఆవిరై పోతోంది. పంట పండిన తర్వాత కొందరు ధర కోసం వరి కుప్పలు వేస్తుంటారు. అలాంటి వాటికి నిప్పంటుకొని గత కొద్ది కాలంగా అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. జాగ్రత్తలతో ఇలాంటి ఘటనలను నివారించవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. రాజానగరం నియోజకవర్గంలో సీతానగరం, రాజానగరం, కోరుకొండ మండలాలు ఉన్నాయి. ఖరీఫ్‌లో మొత్తం 20 వేల ఎకరాల్లో వరి సాగవుతోంది. ఇందులో కొందరు ధాన్యాన్ని విక్రయించగా, సుమారు 5 వేల ఎకరాల్లో రైతులు మాత్రం ధాన్యాన్ని కుప్పలుగా వేస్తున్నారు. పలు కారణాలతో వీటికి నిప్పంటుకోవడం జరుగుతోంది. ఈ విధంగా రాపాక, వంగలపూడి, రామచంద్రపురం, ముగ్గళ్ల, నల్గొండ తదితర గ్రామాల్లో ప్రమాదాలు జరిగాయి. ఇలా రైతు కష్టం అగ్నికి ఆహుతైంది. రబీలో మొక్కజొన్న తదితర పంటలు వేసి పూర్తయ్యాక చెత్తకు నిప్పంటిస్తుంటారు. దీనివల్ల పక్క పొలాల్లో ధాన్యం కుప్పలకు నిప్పంటుకుని ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అంతేకాకుండా ఎండలకూ, కాల్చి పారేసిన సిగరెట్ల కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

దూరం.. ఆపై ప్రమాదం

వరికుప్పలు గ్రామానికి దూరంగా ఉన్న పొలాల్లో ఉండటంతో ఏవిధమైన నష్టం కలిగినా సమాచారం రైతులకు ఆలస్యంగా తెలుస్తుంది. అప్పటికే నష్టం తీవ్రస్థాయిలో ఉంటుంది. ఇదిలా ఉంటే అగ్నిమాపక కేంద్రం రాజమహేంద్రవరంలో ఉంది. అక్కడి నుంచి అగ్నిమాపక శకటం సంఘటన స్థలానికి వచ్చేలోగా జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. ఇలాంటి ఘటనల నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

మూడెకరాల్లో పంట వేశా..



ఖరీఫ్‌లో మూడెకరాల్లో వరి పంట వేశాను. వరి కుప్పలు వేసి ఉంచాను. దాళ్వాలో పంటను మెషీన్‌తో కోతలు జరిపి ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించాను. పొలంలో ఉన్న వరి కుప్పలు గాలిలో దీపంగా ఉన్నాయి. కూలీల కొరత ఎక్కువగా ఉంది. ఏ సమయంలో ఏం జరుగుతుందోనని భయంగా ఉంది. మండలంలో అగ్నిమాపక కేంద్రం ఉంటే బాగుండేది.

–ఎస్ దుర్గయ్య, లంకూరు

సమాచారం ఇస్తే మంచిది



వేసవిలో కౌలురైతుల పరిస్థితి దినదిన గండంలా ఉంటుంది. మొక్కజొన్న తుక్కుకు నిప్పుపెట్టే సమయంలో వరి కుప్పలకు అగ్ని ప్రమాదం జరిగే అవకాశం ఉంది. రైతులు మొక్కజొన్న తుక్కుకు నిప్పు పెట్టే సమయంలో పక్కనే ఉన్న వరికుప్పల రైతులకు సమాచారం ఇవ్వాలి. దీనివల్ల ప్రమాదాలను అరికట్టవచ్చు.

–పేరిచర్ల శ్రీనివాసరాజు, వంగలపూడి

రేపు జాబ్ మేళా

అనపర్తి: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాను శుక్రవారం స్థానిక జీబీఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాటు చేసినట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎ.కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాకు ప్రముఖ టెక్ మహేంద్ర, ఏఏఎం జియో స్పాటియల్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, ముతూట్ ఫైనాన్స్ తదితర కంపెనీలకు సంబంధించిన ప్రతినిధులు హాజరై అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఆయా కంపెనీల్లో వివిధ ఉద్యోగాలకు గాను బి.టెక్, పాలిటెక్నిక్, ఐటీఐ, బీఎస్సీ కెమిస్ట్రీ, బీకాం, ఎం ఫార్మసీ, బీ ఫార్మసీ, డీ ఫార్మసి, పీజీ, డిప్లొమా, ఎంఎస్‌సీ కెమిస్ట్రీ, బి.ఫార్మసితోపాటు పదో తరగతి, ఇంటర్ (పాస్ లేదా ఫెయిల్) 19 నుంచి 30 ఏళ్ల ఉన్న అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు పోస్ట్, విద్యార్హత, కంపెనీ, అనుభవం ఆధారంగా సుమారు రూ.10వేల నుంచి 30 వేల వరకూ వేతనం ఉంటుందని తెలిపారు. ఈ నెల 12న నిర్వహించే జాబ్ మేళాకు హాజరైన అభ్యర్థులను ఇంటర్వ్యూ నిర్వహిస్తారని తెలిపారు. అభ్యర్థులు తమ పూర్తి వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. అభ్యర్థులు బయోడేటా, సంబంధిత జిరాక్స్ కాపీలతో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి జీబీఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలను 9550882754, 9581810049 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సమష్టి కృషితోనే విజయం

కలెక్టర్ మాధవీలత



కలెక్టర్ మాధవీలతను సత్కరిస్తున్న ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి, జేసీ తేజ్‌భరత్ తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): అధికారుల సమష్టి కృషితోనే విజయం వరిస్తుందని, తూర్పుగోదావరి జిల్లా రెడ్‌క్రాస్ యూనిట్‌కు ప్రతిష్టాత్మక అవార్డు రావడం అందుకు నిదర్శనమని కలెక్టర్ మాధవీలత అన్నారు. రెడ్‌క్రాస్ అవార్డును గవర్నర్ చేతుల మీదుగా తీసుకున్న సందర్భంగా కలెక్టర్‌ను కలెక్టరేట్ అధికారులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా కొత్తగా ఏర్పడిన ఏడాది కాలంలో రెడ్‌క్రాస్ యూనిట్ ద్వారా ఎన్నో కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇంకా ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. మున్ముందు ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరారు. జిల్లా రెడ్‌క్రాస్ యూనిట్ ద్వారా మరిన్ని ప్రజా ప్రయోజనకర పనులు చేపట్టే దిశగా అడుగులు వేద్దామని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాకు పూర్తి స్థాయి ఎస్పీ సుధీర్‌కుమార్ అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. రానున్న రోజుల్లో ఫస్ట్ ఎయిడ్ శిక్షణ, యువ రెడ్‌క్రాస్ సభ్యులకు అవగాహన, ప్రకృతి విపత్తుల నిర్వహణ, మాదక ద్రవ్యాల నిరోధం, మొక్కలు నాటడం, జిల్లా స్థాయి క్రీడా పోటీలు, రక్తదాన శిబిరాలు, మెడికల్ క్యాంపులు, ప్రత్యేక జాతీయ, అంతర్జాతీయ దినోత్సవాల సందర్భంగా వేడుకలు, శుభ్రత పరిశుభ్రతపై అవగాహన తదితర కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టడంతో జిల్లా యూనిట్ పటిష్టం చేద్దామని అన్నారు. జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిళారెడ్డి, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, డీఆర్వో జె.నరసింహులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- కొత్తపల్లిలో నూతన ప్రభుత్వాస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన



ప్రభుత్వాస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని కొత్తపల్లిలో రూ.2.21 కోట్ల అంచనాలతో నూతనంగా నిర్మించే పది పడకల ప్రభుత్వాస్పత్రి నిర్మాణానికి ఎమ్మెల్యే చంటిబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తోందన్నారు. అనంతరం తాత్కాలిక భవనంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వాస్పత్రిని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కె.సుధాకర్, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, నాయకులు సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు గాజింగం సత్తిబాబు, గ్రామ సర్పంచ్ కంచుమర్తి కాటమస్వామి, ఉప సర్పంచ్ తోట సంధ్యాదేవి, ఎంపీటీసీలు ఎం.భువనేశ్వరి, గుడేల చిన్న, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ కేవీఎస్ఎన్ మూర్తి, ఈఓపీఆర్‌డీ రాజేశ్వరరావు, డాక్టర్లు రవిచంద్ర, తిరస్, లిఖిత ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సాయం చేయడంలోనే సంతృప్తి



ఆశ్రమానికి నిత్యావసరాలు అందజేస్తున్న కెనరా బ్యాంకు రీజినల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రవిచంద్ర

కంబాలచెరువు: తోటివారికి సాయం చేయడంలోనే సంతృప్తి ఉంటుందని, దానిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని కెనరా బ్యాంకు రీజినల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ తోట రవిచంద్ర అన్నారు. కెనరా బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా స్థానిక మున్సిపల్ కాలనీలోని ప్రియదర్శిని ఆశ్రమంలో పిల్లలకు బుధవారం నిత్యావసరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకరు, ఇద్దరు పిల్లలను పెంచేందుకే ఇబ్బంది పడే మనం.. 150 మంది పిల్లలకు నిత్యం సౌకర్యాలు చూడడం, వారిని చదివించడం, భోజనం అందించడం చిన్న విషయం కాదన్నారు. ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొని ఆశ్రమాన్ని నడిపిస్తున్న నిర్వాహకురాలు స్వప్నవర్మ అభినందనీయురాలని అన్నారు. బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆశ్రమంలోని చిన్నారుల అవసరాలు తీర్చేందుకు తమ సిబ్బంది ముందుకు వచ్చారన్నారు. కెనరా బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు గణేష్, వెంకటేశ్వరరావు, సూర్య, లలిత, మానస, ఆశ్రమ ప్రిన్సిపాల్ ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే ఉపేక్షించం

- భవానీ శంకర్ హత్య దారుణం
- బాధిత కుటుంబానికి ఎంపీలు భరత్‌రామ్, బోస్ పరామర్శ



భవానీ శంకర్ మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, గణేష్

రాజమహేంద్రవరం సిటీ: ప్రశాంతమైన నగరంలో హత్యలు, నేరాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని ఎంపీ మార్గాని భరత్‌రామ్ స్పష్టం చేశారు. స్థానిక సంజీవ్‌నగర్‌లో 44వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బూరాడ భవానీశంకర్ మంగళవారం ఓ యువకుడి చేతిలో అతి కిరాతకంగా హత్యకు గురయ్యారు. ఈ విషయం తెలియగానే ఢిల్లీలో ఉన్న ఎంపీ భరత్‌రామ్ తన కార్యక్రమాలన్నీ రద్దు చేసుకుని నగరానికి వచ్చారు. బుధవారం ఆయన సంజీవ్‌నగర్‌లోని బూరాడ భవానీ శంకర్ నివాసానికి రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో వెళ్లారు. అనంతరం భవానీశంకర్ మృతదేహానికి నివాళులర్పించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులు శంకర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మంచి నేతను కోల్పోయాం..

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ బలోపేతానికి ఆహర్నిశలు శ్రమించిన బూరాడ భవానీ శంకర్ మృతి పార్టీకి తీరని లోటు అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. సంజీవ్‌నగర్‌లో భవానీ శంకర్ పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ జక్కంపూడి కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన శంకర్‌ను కోల్పోవడం చాలా బాధగా ఉందన్నారు. డివిజన్లో ఏ కార్యక్రమం చేపట్టాలన్నా తన భుజ స్కందాలపై వేసుకుని విజయవంతం చేసేవారన్నారు. వార్డులో సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేసేవారన్నారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

ఆర్థిక స్వావలంబన సాధించాలి

రాజమహేంద్రవరం సిటీ: చేతి వృత్తులతో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఓఎన్జీసీ జనరల్ మేనేజర్ బాపట్ల ప్రసాదరావు అన్నారు. బుధవారం స్థానిక లాలాచెరువు స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో మగ్గం వర్క్ టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న మహిళలకు ఉచితంగా మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది మందికి శిక్షణ అందించడం ద్వారా వారు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఎంతో నిబద్ధతగా ఈ శిక్షణ నిర్వహించడం అభినందనీయమన్నారు. నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ ఇప్పటి వరకు సుమారు 16,500 మందికి శిక్షణ అందించామన్నారు. సుమారు 70 మంది కంప్యూటర్, మగ్గం, టైలరింగ్ కోర్సులలో ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో నైపుణ్య శిక్షణ కేంద్రం ఇన్‌చార్జ్ దుర్గాదేవి, దివ్య, జాహ్నవి, శ్రీలత, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యం

- సీఎం జగన్‌తోనే అది సాధ్యం
- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- వ్యవసాయ కళాశాల భవనం ప్రారంభం



వ్యవసాయ కళాశాల భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ.. మానవ వనరుల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక సంస్కరణలు తీసుకువచ్చారని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. బుధవారం కాతేరులోని సీటీఆర్ఐ ఆవరణలో రూ.24 కోట్లతో నిర్మించిన ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల నూతన భవనం, బాలుర, బాలికల హాస్టల్స్‌ను ఆయన, రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో మంత్రి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ 2008లో మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి రాజమహేంద్రవరంలో వ్యవసాయ కళాశాల నిర్మాణానికి నాంది పలికితే, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయన్నారు. ఇప్పుడు వైఎస్సార్ తనయుడు సీఎం వైఎస్ జగన్ హయాంలో వ్యవసాయ కళాశాల పూర్తయి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ ఆదాల విష్ణువర్ధన్‌రెడ్డి నేతృత్వంలో జాతీయ స్థాయిలో 31 స్థానం నుంచి నేడు 13వ స్థానానికి వచ్చిందన్నారు. తిరిగి ఈ ఏడాది ఐదు, ఆరు స్థానాలకు తప్పనిసరిగా వస్తుందన్నారు. వ్యవసాయ రంగంలో భూ పోషక విలువలను గుర్తించేలా ప్లాంట్ డాక్టర్ కాన్సెప్ట్ విధానాన్ని ముఖ్యమంత్రి తీసుకొచ్చారన్నారు. రైతు భరోసా మాసపత్రిక ద్వారా, వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా వ్యవసాయంలో సాంకేతిక విధానాన్ని రైతులకు అందిస్తున్నామన్నారు. నూతన సాంకేతిక విధానంతో వ్యవసాయ రంగంలో సీఎం జగన్ విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తున్నారన్నారు. వ్యవసాయ కళాశాలలకు శాశ్వత భవనాలను నిర్మిస్తున్నారని మంత్రి తెలిపారు. రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ రైతు బాంధవుడిలా వ్యవసాయాన్ని పండుగలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మార్చారన్నారు.

ప్రథమ స్థానంలో ఏపీ

యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆదాల విష్ణువర్ధనరెడ్డి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న 74 వ్యవసాయ కళాశాలల్లో ఐసీఆర్ పరీక్షలు నిర్వహించగా ప్రథమస్థానంలో ఏపీ ఉండటంతో కేంద్ర మంత్రి ద్వారా ఇటీవలే అవార్డు తీసుకున్నామని తెలిపారు. దేశంలో అగ్రికల్చర్ యూనివర్సిటీలలో ఆచార్య ఎన్‌జీ రంగా యూనివర్సిటీ సముచిత స్థానంలో ఉందన్నారు. దేశంలో ఇతర ప్రాంతాల నుంచి మన యూనివర్సిటీలో చదివేందుకు 200 మంది చేరారన్నారు. జాతీయ స్థాయిలో రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు ఫెలోషిప్ అవార్డులు వచ్చాయన్నారు. ఎంపీ మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో మరింత సాంకేతికతను వినియోగించుకుని అభివృద్ధికి దిశగా తీసుకువెళ్లాలన్నారు. అభివృద్ధి చెందిన దేశాలు అమెరికా, వియత్నాంలలో వ్యవసాయ సాంకేతిక పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థులు అధునాతన పరిజ్ఞానం ద్వారా రైతులకు మరిన్ని సాంకేతికపరమైన అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ఉన్న విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాగాలన్నారు. తాను కూడా వ్యవసాయ కళాశాలలో పూర్వ విద్యార్థినేనన్నారు. రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిళారెడ్డి, డీసీఎమ్ఎస్ చైర్మన్ సాకా మణికుమారి, సీటీఆర్ఐ డైరెక్టర్ మాగంటి శేషుమాధవ్, కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ శ్యామ్‌రాజు నాయక్, కళాశాల ప్రొఫెసర్ పి.ప్రవీణ, రిజిస్ట్రార్ జి.రామారావు, డీన్ సుధాకరరావు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

సీతానగరం: చినకొండేపూడిలో పేకాటాడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేశామని ఇన్‌చార్జి ఎస్సై ఎంవీ ఆర్ రెడ్డి బుధవారం తెలిపారు. ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ సోమశేఖర్ సమాచారంతో చినకొండేపూడిలోని జిల్లా పరిషత్ హైస్కూల్ వెనుక ఉన్న మామిడి తోటలో పరిశీలించామన్నారు. అక్కడి ఓ పూరిపాకలో పేకాటడుతుండగా ఆరుగురిని ఎస్ఈబీ సీఐలు జి.సత్యనారాయణ, అప్పారావు, సీతానగరం పోలీస్ స్టేషన్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.11,360, మూడు మోటారు సైకిళ్లు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చుతామని రెడ్డి తెలిపారు.

పాలిసెట్‌కు 1,248 మంది హాజరు



గైట్ క్యాంపస్‌లో పాలిసెట్‌కు హాజరైన విద్యార్థులు

రాజానగరం: గైట్ క్యాంపస్‌లోని ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం జరిగిన పాలిటెక్నిక్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (పాలిసెట్)కు 1,248 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ పీజీ రామానుజం తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ పరీక్ష జరిగింది.

నేడు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

బిక్కవోలు: కాపవరంలో వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా సెంటర్, వంగవీటి మోహన్‌రంగా విగ్రహాన్ని ప్రారంభించనున్నట్టు వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు సత్యంశెట్టి వెంకటరమణ బుధవారం తెలిపారు. సుమారు రూ.39.30లక్షలతో అభివృద్ధి చేసిన పనులను చేశారు. ఈ కార్యక్రమంలోని ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, శాసన మండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఇంద్ర వందిత్ హాజరవుతున్నారని తెలిపారు.

వేసవి శిక్షణ శిబిరం

సీతానగరం: స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతుంది. బుధవారం లైబ్రేరియన్ టి.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు కన్నూరి సతీష్‌బాబు, ఆంద్ర సుబ్రహ్మణ్యం పలు అంశాలు వివరించారు. సరస్వతీ నమస్తుభ్యం గేయాన్ని విద్యార్థిని, విద్యార్థులతో ఆలపించారు. తెలుగు భాషపై అవగాహన కల్పించారు.

బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

రాజమహేంద్రవరం రూరల్: ఓ ఇంజినీరింగ్ కళాశాల బస్సు ఢీకొని ఒక వృద్ధుడు మృతిచెందిన సంఘటన బుధవారం హుకుంపేట జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రాజవోలు అరుంధతీపేటకు చెందిన అనంతారపు వెంకట్రావు (63) స్థానిక పేపరుమిల్లులో పనిచేసి పదవీ విరమణ పొందారు. ప్రస్తుతం రాజమహేంద్రవరంలోని అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం 8.30 గంటల సమయంలో టీవీఎస్ మోపెడ్‌పై రాజవోలులోని ఇంటికి వెళుతుండగా హుకుంపేట జాతీయ రహదారిపై వెనుక నుంచి వచ్చిన ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాల బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటరావు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకట్రావు కుమారుడు అనంతారపు చిట్టిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొమ్మూరు పోలీస్ స్టేషన్ ఎస్సై ఆర్.శివాజీ కేసు నమోదు చేశారు.

వేసవి శిక్షణతో సృజనాత్మకత

కడియం: వేసవి శిక్షణ శిబిరాలతో చిన్నారుల్లో సృజనాత్మకత పెరుగుతుందని కడియం లైబ్రేరియన్ శ్రీదేవినిర్మల అన్నారు. స్థానిక గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో మూడో రోజు కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిష్, స్వాతంత్ర్య ఉద్యమం గురించి చిన్నారులకు వివరించారు. పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. అలాగే మిమిక్రీ ఏర్పాటు చేశారు. దాతలు సమకూర్చిన స్వీట్లు, బిస్కెట్లు, చాక్లెట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు.

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. పుస్తక పఠనం, నీతి కథలు చెప్పడం, హ్యాండ్ క్రాఫ్ట్, డ్రాయింగ్, వేదిక్ మ్యాథ్స్, లలిత సంగీతం తరగతులు జరిగాయి. మతల రమేష్, మాధవీలత, బొడ్డు శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు. ట్రస్ట్ సభ్యుడు చలుమూరి సత్యనారాయణ విద్యార్థులకు మజ్జిగ వితరణ చేశారు. వేరుశెనగ చిక్కీలను వాడ్రేవు అలివేలు పంపిణీ చేశారు.

రాత పూర్వక ఉత్తర్వులు ఇవ్వండి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉపాధ్యాయులు వేసవి సెలవులలో విధులు నిర్వహించేందుకు రాత పూర్వక ఉత్తర్వులు ఇవ్వాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహంకు జిల్లా ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) బుధవారం వినతిపత్రం ఇచ్చింది. వెకేషన్ ఎంప్లాయీస్‌గా ఉన్న ఉపాధ్యాయులకు వేసవి సెలవులలో నాడు–నేడు పాఠశాల విధులు, ఉయ్ లవ్ రీడింగ్ నిర్వహణ, వివిధ రకాల శిక్షణ నిర్వహించడం, పాఠ్య పుస్తకాల విధులు, హాబిటేషన్ సెన్సస్ తదితర విధులు కేటాయిస్తున్నారన్నారు. దీనికి ఎటువంటి రాతపూర్వక ఉత్తర్వులు ఇవ్వకపోవడం సరికాదన్నారు. సెలవుల్లో విధులు నిర్వహిస్తే సదరు పని చేసిన రోజులకు గాను సంపాదిత సెలవులు మంజూరు చేయాల్సి ఉందన్నారు. ఫ్యాప్టో చైర్మన్ పి.జయకర్, పి.శ్రీనివాసరావు, ఎ.షరీఫ్ పాల్గొన్నారు.